సాక్షి
నిజామాబాద్
శనివారం। 30। ఆగస్టు। 2025

కామారెడ్డి జీఆర్ కాలనీలో వరద నీటిలో తడిసిన వస్తువులను ఇంటి బయట పెట్టిన కాలనీవాసులు



గరిష్టం/కనిష్టం
28.1 /21.4

వాతావరణం
చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

తుది జాబితాకు సహకరించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



నిజామాబాద్‌అర్బన్ : మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలుంటే, ఈ నెల 30వ తేదీ వరకు తెలపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను 28న ప్రదర్శించినట్లు తెలిపారు. 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 31న పరిష్కరిస్తామన్నారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విపత్తులను ఎదుర్కోవాలి

- సీపీ సాయిచైతన్య



రెంజల్(బోధన్): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విపత్తులను ఎదుర్కోవాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయిచైతన్య సూచించారు. గోదావరి, మంజీరా నదుల పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శుక్రవారం మండలంలోని కందకుర్తితోపాటు జాతీయ రహదారి 61–బీబీ రోడ్డు పక్కన ఉన్న బోర్గాం, తాడ్‌బిలోలి రహదారిని పరిశీలించారు. అనంతరం స్థానికులతో సీపీ మాట్లాడారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు.ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, రెంజల్–2 ఎస్సై రాజు ఉన్నారు.

రోడ్లు ధ్వంసం.. నష్టం రూ.23.74 కోట్లు



నిజామాబాద్‌నాగారం: భారీ వర్షాలకు జిల్లాలోని పలుచోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 29.55 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. నాలుగు వంతెనలు, నాలుగు కల్వర్టులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 2.71 కిలోమీటర్ల మేర రోడ్ల అంచులు దెబ్బతినగా, 15 చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. వరద ప్రవాహానికి మరో 10 చోట్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రూ.23.74 కోట్ల వరకు నష్టం జరిగినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ.3 కోట్ల వరకు అవసరమవుతాయని, ఈ విషయమై ప్రభుత్వానికి సైతం నివేదించినట్లు ఆ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ వసంత్‌నాయక్ తెలిపారు.

చంటి పిల్లతో సాలూరలోని పునరావాస కేంద్రానికి వస్తున్న ఖాజాపూర్ గ్రామ బాలింత, కుటుంబ సభ్యులు



వేల్పూర్- రామన్నపేట్ గ్రామాల మధ్య తెగిపోయిన రోడ్డు



కప్పలవాగుకు వచ్చిన అతి భారీ వరదకు వేల్పూర్ మండలం మోతెలో నేలకొరిగిన మొక్కజొన్న పంట





సిరికొండ మండలం వాడీ గ్రామంలో ఇళ్ల నుంచి బురదను తొలగిస్తున్న బాధితులు

వరద విలాపం

- భారీ వర్షంతో అపార నష్టం
- మళ్లీ వర్షం కురుస్తుందేమోనని టెన్షన్
- సిరికొండ, ధర్పల్లిలో కుండపోత
- మంజీర ఉధృతితో పలు గ్రామాలు జలమయం
- కందకుర్తిలోకి ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్
- జిల్లాలోని 21 మండలాల్లో 41,348 ఎకరాల్లో పంట నష్టం
- పలు మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ సరఫరా వ్యవస్థ
- ఎస్సారెస్పీకి భారీగా ఇన్‌ఫ్లో.. 39 గేట్లు ఎత్తిన అధికారులు

ఉమ్మడి జిల్లాపై వరుణుడు ప్రతాపం చూపాడు. రెండ్రోజులపాటు కురిసిన భారీ వర్షాలతోపాటు ఎగువ నుంచి వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. జనజీవనం అతలాకుతలమైంది. పలువురిని వరద కోలుకోలేని దెబ్బతీసింది. పలు ప్రాంతాలలో ఎటుచూసినా వరుణుడు సృష్టించిన బీభత్సమే కనిపిస్తోంది. పంటలు కోల్పోయి కొందరు.. ఇళ్లు కూలి మరి కొందరు.. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఇంకొందరు తీవ్రంగా నష్టపోయారు. వరద ఉధృతికి పంటలు దెబ్బతినగా, రోడ్లు కోతకు గురయ్యాయి. గోదావరి, మంజీరాలు ఉగ్రరూపం దాల్చడంతో ఎస్సారెస్పీకి పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో వస్తోంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. సిరికొండ నుంచి నిజామాబాద్ వెళ్లేందుకు ఉన్న రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లోనూ పలు రోడ్లు దెబ్బతిన్నాయి. సిరికొండ, ధర్పల్లి మండలాల్లో వివిధ గ్రామాల నుంచి వరద నీరు వెళ్లిపోవడంతో పునరావాస కేంద్రాల నుంచి ముంపు బాధితులు ఇళ్లకు చేరారు. సిరికొండ మండలంలోని గడ్కోల్, ముషీర్‌నగర్, తాళ్లరామడుగు, ధర్పల్లి మండలంలోని హొన్నాజీపేట, వాడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. సిరికొండ మండలం తూంపల్లిలో గురువారం రాత్రి 23.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సిరికొండలో 16.1, ధర్పల్లిలో 16.5, రెంజల్ మండలం కందకుర్తిలో 16.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- బోధన్ డివిజన్‌లో 40 ఏళ్ల తర్వాత మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సాలూర మండలంలోని మందర్నా, ఖాజాపూర్, హున్సా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కాయి. మరోవైపు రెంజల్ మండలం కందకుర్తి, నీల, బోర్గం, తాడ్‌బిలోలి గ్రామాల్లోకి శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ చేరింది. బోధన్ నుంచి భైంసా వైపు వెళ్లే 161–బీబీ జాతీయ రహదారిపైకి నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- నిజామాబాద్ నగరంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పులాంగ్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండుచోట్ల పులాంగ్ లోలెవెల్ వంతెనలను మూసేశారు. ఈ నేపథ్యంలో గూపన్‌పల్లి వద్ద లోతట్టు శ్రామికనగర్ ప్రాంతాల వారిని పునరావాస కేంద్రానికి తరలించారు.
- శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 4,30,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో 39 గేట్లు ఎత్తి దిగువకు 5,71,217 క్యూసెక్కులు వదులుతున్నారు. డ్యామ్ వద్దకు పర్యాటకులు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు చేస్తున్నారు. ఇక బాల్కొండ నుంచి నిర్మల్ వైపు భారీ వాహనాలు, లారీలను అనుమతించడం లేదు. నిర్మల్ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు కరీంనగర్ మీదుగా వెళుతున్నాయి.
- కామారెడ్డి జిల్లా టేక్రియాల్, జంగంపల్లి వద్ద జాతీయ రహదారి 44 కోతకు గురవ్వడంతో భారీ వాహనాలు అనుమతించడం లేదు. సింగిల్ లైన్ ద్వారా విడతకు 50 వాహనాలు పంపుతున్నారు. దీంతో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు, కార్లు ఈ ప్రాంతంలో 5 నుంచి 6 గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. ఉదయం 3 గంటలకు నిజామాబాద్‌లో బయల్దేరిన ఆర్టీసీ బస్సు ఉదయం 11 గంటల వరకు కామారెడ్డి జిల్లాలోని అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద ఆగాల్సి వచ్చింది. ఇక హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి వెళ్లాల్సిన వారు కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్లారు.



సిరికొండ: గడ్కోల్‌లో పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఇసుక మేటలు..

జిల్లాలో 21 మండలాల్లోని 145 గ్రామాల్లో 20,797 మంది రైతులకు చెందిన 41,348 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ పంట నష్టం మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. సిరికొండ, ధర్పల్లి, భీమ్‌గల్, ఇందల్వాయి, మెండోరా, చందూర్, వర్ని, సాలూరా, డిచ్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్ మండలాల్లోని 1,021 ఎకరాల పంట భూముల్లో ఇసుకమేటలు వేశాయి.



కందకుర్తి గ్రామంలోని స్వయంభూ రామాలయం చుట్టూ చేరిన గోదావరి వరద నీరు

దెబ్బతిన్న పంటల వివరాలు

పంట	ఎకరాలు	బాధిత రైతులు
పసుపు	250	137
వరి	28,131	14,663
పత్తి	81	47
మొక్కజొన్న	565	382
పెసర	05	05
సోయాబీన్	12,054	5,418



జీఆర్ కాలనీలో ఇంట్లో చేరిన చెత్తను బయటకు ఊడుస్తున్న వ్యక్తి

కామారెడ్డిలో కన్నీటి వరద

- తీవ్ర నష్టం మిగిల్చిన వర్ష బీభత్సం
- ఇళ్లలో చేరిన నీటితో దెబ్బతిన్న సామగ్రి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో బుధ, గురువారాల్లో వరద సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. వేలాది కుటుంబాలు ఆగమయ్యాయి. వరదలు ముంచెత్తడంతో కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీలలో తీవ్ర నష్టం జరిగింది. ఈ కాలనీలలో నివసిస్తున్న వారిలో అధికులు దిగువ మధ్యతరగతికి చెందిన వారే.. ఉద్యోగాలు, వ్యాపారాలు, వృత్తులు చేసుకునేవారు బ్యాంకు లోన్లు తీసుకుని ఇళ్లు కొనుగోలు చేశారు. అకస్మాత్తుగా వచ్చిన వరదలు వారిని ఇక్కట్ల పాలు చేశాయి. కొందరి బైకులు, కార్లు వరదలో కొట్టుకుపోగా, మరికొందరి వాహనాలు దెబ్బతిన్నాయి. ఒక్కో కుటుంబానికి తక్కువలో తక్కువ రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

పంటలు గంగపాలు...

వరదలతో వేలాది ఎకరాల్లో పంటలు నీటిపాలయ్యాయి. జిల్లాలో దాదాపు 80 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. కొన్నిచోట్ల ఇసుక మేటలు వేసింది. జిల్లాలో దాదాపు రూ.150 కోట్ల మేర పంట నష్టం జరిగి ఉంటుందని అంచనా.

నిలిచిన రాకపోకలు

జిల్లాలో ప్రధాన రోడ్లు చాలావరకు దెబ్బతిన్నాయి. 44వ నంబరు జాతీయ రహదారిపై పలుచోట్ల గండ్లు పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. మెదక్–ఎల్లారెడ్డి–బాన్సువాడ రోడ్డు పూర్తిగా బందయ్యింది. పోచారం సమీపంలో వంతెన పూర్తిగా దెబ్బతినడంతో ఇప్పట్లో బాగు చేసే పరిస్థితి లేకుండాపోయింది. కరీంనగర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి రోడ్డుపై పలుచోట్ల వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బాన్సువాడ–కామారెడ్డి రోడ్డు పరిస్థితి కూడా అంతే.. కొన్ని ఊళ్లలోనయితే అన్ని వైపులా రోడ్లు తెగిపోయి బయటకు వెళ్లలేని పరిస్థితులున్నాయి.



కామారెడ్డి జీఆర్ కాలనీలో తడిసి ముద్దయిన సామగ్రిని ఇంటిబయటకు తెచ్చిన కాలనీవాసులు

ముమ్మరంగా సహాయక చర్యలు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

బోధన్/బోధన్‌రూరల్: భారీ వర్షాలు, వరద తాకిడికి గురైన ప్రాంతాలలో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్, బోధన్ మండలం కొప్పర్గ–హంగర్గ గ్రామాల్లో సహాయ చర్యలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలను ట్రాక్టర్లు, బోట్‌లు, ప్యాసింజర్ ఆటోల్లో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న తీరును గమనించి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు భోజనం, మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. ఎస్సారెస్పీకి భారీ వరద పోటెత్తడంతో బ్యాక్‌వాటర్ ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి 5 లక్షల క్యూసెక్కులకు పైచిలుకు నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నామని వెల్లడించారు. వరద తాకిడి ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, 7వ బెటాలియన్ పోలీస్ బృందాలు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయని వివరించారు.



సాలూర-ఖాజాపూర్ గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

గోదావరి ఉధృతం

- శ్రీరాంసాగర్‌కు భారీ వరద
- 4.3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- 5.5 లక్షల క్యూసెక్కుల అవుట్ ఫ్లో

బాల్కొండ: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు శ్రీరాంసాగర్ జలాశయంలోకి వచ్చి చేరుతుంది. గురువారం రాత్రి వరకు 3.81 లక్షల క్యూసెక్కులు వచ్చిన వరద, రాత్రి 11 గంటల తర్వాత 4 లక్షలకు పెరిగింది. శుక్రవారం ఉదయం 11 గంటల వరకు నిలకడగా వచ్చిన వరద, మళ్లీ 4.3 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ఎస్సారెస్పీ 39 వరద గేట్ల ద్వారా 5.04లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్ట్ నీటి నిల్వను మరింత ఖాళీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో మధ్యాహ్నం 2 గంటలకు నీటి విడుదలను 5.5 లక్షల క్యూసెక్కులకు పెంచారు.

ఉప్పొంగిన ప్రవాహం..

ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా 5.5 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో దిగువ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్ట్ కాలనీ వద్ద ఉన్న గంగమ్మ ఆలయం చుట్టూ నీరు చేరింది. జాతీయ రహదారి 44పై ఉన్న సోన్ వంతెనకు ఆనుకొని ప్రవహిస్తోంది. దీంతో గోదావరి వైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మెండోరా మండలం దూదిగాం, చాకీర్యాల్, కొడిచర్ల, సావెల్ గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



వరద కాలువకు తగ్గిన నీటి విడుదల

వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 1085.60(61.93 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

హున్సాలోనే తహసీల్దార్



గురువారం రాత్రి హున్సా గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శశిభూషణ్

బోధన్: సాలూర మండల తహసీల్దార్ శశిభూషణ్ గురువారం రాత్రి మంజీర నది తీరాన ఉన్న హున్సా గ్రామంలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం మంజీర నదికి భారీ వరద రావడంతో హున్సా –ఖాజాపూర్ గ్రామాల మధ్య వాగు వంతెన మీదుగా ఉధృతంగా ప్రవహించడంతో హున్సాలోనే ఉండిపోయారు. శుక్రవారం ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీస్ అధికారులతో కలిసి బోటులో హున్సా నుంచి మందర్నా గ్రామానికి వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించి తిరిగి హున్సాకు చేరుకున్నారు. కాగా, సాలూర శివారులోని నరిగాగు, మంజీర నది బ్యాక్‌వాటర్‌తో రోడ్డుపై వరద ప్రవాహం పెరిగింది. దీంతో సాలూర నుంచి ఖాజాపూర్ వెళ్లే రోడ్డును పోలీసులు మూసివేశారు.



సాలూర-ఖాజాపూర్ రోడ్డును మూసివేసి పహారాకాస్తున్న పోలీసులు



రెంజల్: బోర్గాం-తాడ్‌బిలోలి గ్రామాల మధ్య నీట మునిగిన పంటలు



సాలూర పునరావాస కేంద్రంలో ముంపు బాధితులు



హంగర్గ నుంచి బాధితులను తరలిస్తున్న రెస్క్యూటీం

ఎన్‌హెచ్-161పై రాకపోకలు నిలిపివేత

రెంజల్(బోధన్): బోధన్ నుంచి నిర్మల్ జిల్లా భైంసా వరకు నిర్మిస్తున్న 161–బీబీ జాతీయ రహదారిపై శుక్రవారం నుంచి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. రెంజల్ మండలం బోర్గాం–తాడ్‌బిలోలి గ్రామాల మధ్య గల రహదారిపై వరద నీరు ప్రవహించడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.



బోర్గాం-తాడ్‌బిలోలి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన బారికేడ్లు

హంగర్గాలోనే 150 మంది

ఖలీల్‌వాడీ/బోధన్ రూరల్: బోధన్ మండలం హంగర్గా గ్రామంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను రెస్క్యూ టీం బృందాలు పునరావాస కేంద్రాలకు తరలించాయి. శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 300 మందిని కొప్పర్గలోని పాఠశాల, బోధన్‌లోని టీటీడీ కల్యాణ మండపంలోకి తరలించాయి. మరో 150 మంది బాధితులు హంగర్గాలోనే ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



బాల్కొండ: గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండడంతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్‌ సబ్‌ కలెక్టర్‌ అభిజ్ఞాన్‌ మాల్వియా సూచించారు. శుక్రవారం ఆయన శ్రీరాంసాగర్‌ జలాశయాన్ని సందర్శించారు. గోదావరి ఒడ్డున ఉన్న రామాలయం, శివాలయం వరకు నీరు రావడంతో పక్కనే ఉన్న కాలనీవాసులతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరిగే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గోదావరి వైపు ఎవరూ వెళ్లొద్దని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్‌ సంతోష్‌రెడ్డి, ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి, మెండోరా ఎస్సై జాదవ్‌ సుహాసిని, ఏఈఈ రామారావు, సిబ్బంది ఉన్నారు.

సెంట్రల్‌ జైలు తనిఖీ



నిజామాబాద్‌ లీగల్‌: సారంగాపూర్‌లోని నిజామాబాద్‌ సెంట్రల్‌ జైలును శుక్రవారం జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్‌ రావు సందర్శించారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఆయన జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. న్యాయ సహాయం కోసం ఎదురుచూస్తున్న ఖైదీలకు, జిల్లా న్యాయ సేవ సంస్థ ద్వారా ప్యానెల్‌ న్యాయవాదులను ఏర్పాటు చేయనున్నట్లు ఉదయ భాస్కర్‌రావు తెలిపారు. అలాగే మహిళా ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం ఆయన అడిగి తెలుసుకున్నారు. జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. జైలు సూపరింటెండెంట్‌ చింతల దశరథ్‌, జైలర్‌ ఉపేందర్‌ రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

42 సంవత్సరాల తర్వాత..



కందకుర్తి గ్రామంలోని ముఖద్వారం వరకు చేరుకున్న వరద నీరు

రెంజల్‌(బోధన్‌): చెరువులు నిండలేదు.. అలుగులు పారలేదు అయినా భారీ వరద రావడంతో 42 సంవత్సరాల నాటి పరిస్థితులను గోదావరి, మంజీరా పరీవాహక గ్రామాల ప్రజలు, రైతులు గుర్తు చేసుకుంటున్నారు. 1983వ సంవత్సరంలో ఇంతటి వరదను చూసినట్లు గ్రామపెద్దలు పేర్కొన్నారు. 1986, 1992లో వరదలు వచ్చినా 1983 సంవత్స రం నాటి వరదను మళ్లీ ఇప్పుడే తిలకిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, మహారాష్ట్ర నుంచి గోదావరి, నిజాంసాగర్‌ వైపు నుంచి వస్తోన్న మంజీర నది వరద నీరు కందకుర్తి త్రివేణి సంగమం వద్ద ఉగ్రరూపం దాలుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం వరకు కందకుర్తిలోని మహారాష్ట్ర సరిహద్దు వరకు చేరుకున్న వరద, సాయంత్రం గ్రామంలోని ముఖద్వారం వద్దకు చేరింది. దీంతో గ్రామంలోని ఇందిరమ్మ కాలనీవాసులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ముప్పు పసిగట్టి.. అప్రమత్తం

- మంజీరా నదికి పోటెత్తిన వరద
- జలదిగ్బంధంలో మూడు గ్రామాలు
- బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించిన అధికారులు, నాయకులు



ఖాజాపూర్‌ గ్రామం నుంచి ట్రాక్టర్లలో గ్రామస్తులను పునరావాస కేంద్రానికి తీసుకొస్తున్న అధికారులు

బోధన్‌: బోధన్‌, సాలూర, పోతంగల్‌ మండలాల పరిధిలో విస్తరించి ఉన్న మంజీర నదికి రెండు రోజులుగా వరద పోటెత్తుతోంది. భారీ వర్షాలకు తోడు నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నేపథ్యంలో మంజీరలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం వరకు వరద ప్రవాహం భారీగా పెరగడంతో సాలూర మండలంలోని మందర్నా, ఖాజాపూర్‌, హున్సా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కాయి. ఐతే, వరద ముప్పును ముందే పసిగట్టిన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. ఖాజాపూర్‌ గ్రామంలోని సుమారు 200 మంది ముంపు బాధితులను నాయకులు ట్రాక్టర్ల ద్వారా సాలూరలోని పెరిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. సాలూర తహసీల్దార్‌ శశిభూషణ్‌ గురువారం రాత్రి హున్సా గ్రామానికి వెళ్లి అక్కడే ఉండిపోయారు. బోధన్‌ రూరల్‌ సీఐ విజయ్‌బాబు, ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి, ఎస్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది లోతట్టు ప్రాంతాల ఇళ్ల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్‌ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బాధితులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన సదుపాయం కల్పించారు. సాలూర పీహెచ్‌సీ డాక్టర్‌ రాజ్‌కుమార్‌ వైద్య సేవలందించారు. ఏఎంసీ చైర్మన్‌ చీల శంకర్‌, నాయకులు ఇల్తెపు శంకర్‌, నాగేశ్వర్‌ రావు, చిద్రపు అశోక్‌, టీపీసీసీ డెలిగేట్‌ గంగాశంకర్‌ శిబిరాన్ని సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు.



ఖాజాపూర్‌లోని ఇళ్ల మధ్యలోకి చేరిన వరద

ఉప్పొంగుతున్న వాగులు

సాలూర మండలంలోని ఖాజాపూర్‌–హున్సా గ్రామాల మధ్య పెద్దవాగు, సాలూర–ఖాజాపూర్‌ గ్రామాల మధ్య నరిగాగు, హున్సా–మందర్నా గ్రామాల మధ్య లోలెవల్‌ వాగు వంతెన మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. హున్సా, మందర్నా గ్రామాల ప్రజలు సురక్షితంగానే ఉన్నారని అధికారులు వెల్లడించారు. కాగా, శుక్రవారం రాత్రి హున్సా వద్ద వరద ఉధృతి కొంతమేర పెరిగినట్లు తెలిసింది.







లోతట్టు ప్రాంతం నుంచి మహిళను తీసుకొస్తున్న యువకులు.. జలదిగ్బంధంలో ఖాజాపూర్‌ జీపీ కార్యాలయం నీట మునిగిన పంటపొలాలు

పర్యాటకులకు అనుమతి నిరాకరణ?



పోచంపాడ్‌లో జాతీయ రహదారి 44 వద్దనే పర్యాటకులను అడ్డుకుంటున్న పోలీస్‌లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులకు పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నారు. వారిని పోచంపాడ్‌లోని జాతీయ రహదారి 44 వద్దనే అడ్డుకుంటున్నారు. ప్రాజెక్ట్‌ సందర్శనకు పర్యాటకులు రావద్దని, పోలీసులకు సహకరించాలని మెండోరా ఎస్సై జాదవ్‌ సుహాసిని శుక్రవారం కోరారు. ప్రాజెక్ట్‌లోకి భారీ వరద రావడంతో ప్రాజెక్ట్‌ నుంచి 5 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవించకుండ పర్యాటకులను జాతీయ రహదారి వద్దనే అడ్డుకుంటున్నారు. దీంతో పర్యాటకులు జాతీయ రహదారి 44పై సోన్‌ వంతెన వద్దకు వెళ్లి గోదావరి జలాలను తిలకిస్తు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి పరీవాహక ప్రాంతాల పరిశీలన



యంచ శివారులో గోదావరి నది వరద ఉధృతిని పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌

నవీపేట: గోదావరి నది పరీవాహక ప్రాంతాలైన మండలంలోని కోస్లీ, మిట్టాపూర్‌, యంచ, అల్జాపూర్‌ గ్రామాలను అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌ శుక్రవారం పరిశీలించారు. యంచ వద్ద గోదావరి నదిలో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద ఉధృతిని పరిశీలించారు. నీట మునిగిన పంటలతోపాటు రహదారిపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. పూర్తిగా వరద నీటితో మునిగిన అల్జాపూర్‌ రహదారిని పరిశీలించారు. ముంపు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో నాగనాథ్‌, తహసీల్దార్‌ వెంకటరమణ, ఏవో నవీన్‌కుమార్‌, ఏఈలు తదితరులు ఉన్నారు.

జిల్లాలోనే డొంకేశ్వర్‌ టాప్‌!



భారీ వర్షానికి డొంకేశ్వర్‌లో డ్రైనేజీలు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్‌)

- వర్షాకాలంలో ఇప్పటి వరకు 97 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో డొంకేశ్వర్‌ మండలంలో అత్యధిక వర్షపాతం రికార్డయింది. వర్షాకాలంలో సెప్టెంబర్‌ నెల కలుపుకొని డొంకేశ్వర్‌ మండలంలో 62 సెంటీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటి దాకా 97 సెంటీ మీటర్లు కురిసింది. అంటే కురవాల్సిన దాని కంటే 35 సెంటీ మీటర్లు ఎక్కువగా నమోదైంది. ఇది జిల్లాలోనే అత్యధిక వర్షపాతం కాగా, జిల్లా సగటు కంటే ఎక్కువ.

మూడు రోజుల్లోనే 19 సెం.మీ..

గడిచిన మూడు రోజుల్లోనే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో 19 సెంటీ మీటర్ల వర్షపాతం రికార్డు కావడం గమనార్హం. ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌లో వరద నీరు పెరగడంతో శివారు ప్రాంతాల్లో వేసిన పంట పొలాలు కొన్ని నీట మునిగాయి. మండలంలోని గ్రామాలన్నీ చాలా సంవత్సరాల క్రితమే ఎస్సారెస్పీ ముంపు నుంచి లేచి వచ్చి దూరంగా ఎత్తయిన ప్రాంతాలకు వచ్చాయి. తద్వారా ఎంతటి భారీ వర్షాలు వచ్చినా వరద ముప్పు నుంచి తప్పించుకుంటున్నాయి. రోడ్లకూ ఎలాంటి నష్టం జరగడం లేదు.

పులాంగ్‌ బ్రిడ్జి మూసివేత



నిజామాబాద్‌ సిటీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్‌లోని వంద ఫీట్ల రోడ్డు నుంచి గాయత్రినగర్‌కు వెళ్లే పులాంగ్‌ వాగు మీది నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో ఈ బ్రిడ్జిని మున్సిపల్‌ అధికారులు మూసివేశారు.

ఇక సీసీల బదిలీలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): పేదరిక నిర్మూలన సంస్థ 'సెర్ప్‌'లో ఉద్యోగ బదిలీలు చివరి దశకు చేరుకున్నాయి. డీపీఎంలు, ఏపీఎంలకు బదిలీలు పూర్తి కాగా, ఇప్పుడు క్లస్టర్‌ కో–ఆర్డినేటర్ల (సీసీలు) వంతు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర సెర్ప్‌ శాఖ నుంచి ఉత్తర్వులు రాగా, సీనియారిటీ జాబితా జిల్లాకు చేరింది. వాస్తవానికి శుక్రవారమే బదిలీ కౌన్సెలింగ్‌ జరగాల్సి ఉండగా, వర్షాల కారణంగా శనివారానికి వాయి దా వేశారు. మొత్తం 145 మంది సీసీలకు కలెక్టరేట్‌లో శనివారం కౌన్సెలింగ్‌ చేపట్టి బదిలీలకు ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ధ్యాన్‌చంద్‌ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీవైఎస్‌వో పవన్‌, ఇతర ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: హాకీ క్రీడాకారుడు మేజర్‌ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని డీవైఎస్‌వో పవన్‌కుమార్‌ అన్నారు. నగరంలోని డీవైఎస్‌వో కార్యాలయంలో శుక్రవారం ధ్యాన్‌చంద్‌ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ధ్యాన్‌చంద్‌ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీవైఎస్‌వో మాట్లాడుతూ.. యువతను, బాలబాలికలను మైదానాలకు తీసుకురావాల్సిన గురుతరమైన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్‌ ఉంటుందన్నారు.

అలాగే క్రీడాకారులకు స్నేహపూర్వకమైన హాకీ టోర్నమెంట్‌ నిర్వహించారు. జిల్లా సైక్లింగ్‌ సంఘం ఆధ్వర్యంలో సైక్లింగ్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆదేశాల మేరకు నగరంలో విద్యార్థులతో సైకిల్‌ ర్యాలీని నిర్వహించారు. రిటైర్డు డీవైఎస్‌వో ముత్తెన్న, సిబ్బంది సురేష్‌, గంగాదాస్‌, చంద్రశేఖర్‌, శేఖర్‌, సత్యనారాయణ, రాష్ట్ర సైకిల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌ కాంత్‌, రవి పబ్లిక్‌ స్కూల్‌ పాఠశాల చైర్మన్‌ సరళ మహేందర్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ శ్యామ్‌ కుమార్‌, శ్రీకాంత్‌ సైక్లింగ్‌ సంఘం సభ్యులు దుర్గ మల్లేష్‌ ,ప్రభాకర్‌, ఆర్‌ నరేష్‌ కుమార్‌ , మురళి రాహుల్‌ పాల్గొన్నారు.

తూంపల్లిలో 23.3 సెం.మీ

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో గురువారం ఉదయం 9 నుంచి శుక్రవారం ఉదయం 9 గంటల వరకు నమోదైన వర్షపాత వివరాలను వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 90.0 మి.మీ వర్షం కురువగా సిరికొండ మండలం తూంపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదైంది.

మండలం	గ్రామం	వర్షపాతం (మి.మీల)			
సిరికొండ	తూంపల్లి	233.3	వేల్పూర్‌	వేల్పూర్‌	78.0
బోధన్‌	కల్దుర్కి	164.5	నందిపేట	సీహెచ్‌ కొండూర్‌	70.8
సిరికొండ	సిరికొండ	161.0	నిజామాబాద్‌ నార్త్‌	గూపన్‌పల్లి	70.3
ధర్పల్లి	ధర్పల్లి	151.3	నిజామాబాద్‌ సౌత్‌	నిజామాబాద్‌ సౌత్‌	66.5
సిరికొండ	చీమన్‌పల్లి	132.0	బాల్కొండ	బాల్కొండ	65.8
మాక్లూర్‌	మదన్‌పల్లి	126.5	నవీపేట	నవీపేట	62.5
భీమ్‌గల్‌	భీమ్‌గల్‌	125.3	ఎడపల్లి	ఎడపల్లి	61.8
డిచ్‌పల్లి	డిచ్‌పల్లి	116.0	ఆర్మూర్‌	ఇస్సాపల్లి	60.3
బోధన్‌	చిన్నమావంది	106.0	నిజామాబాద్‌ రూరల్‌	మల్కాపూర్‌	58.3
డిచ్‌పల్లి	కోరట్‌పల్లి	111.0	మాక్లూర్‌	లక్మాపూర్‌	58.5
కమ్మర్‌పల్లి	కోనసమందర్‌	110.3	రుద్రూర్‌	రుద్రూర్‌	56.0
కోటగిరి	కోటగిరి	104.0	రెంజల్‌	రెంజల్‌	55.8
ఇందల్వాయి	గన్నారం	97.3	ఏర్గట్ల	ఏర్గట్ల	53.3
ఆలూరు	ఆలూర్‌	96.5	నిజామాబాద్‌ నార్త్‌	నిజామాబాద్‌	48.0
నిజామాబాద్‌ రూరల్‌	పాల్దా	96.3	మోర్తాడ్‌	మోర్తాడ్‌	46.5
డొంకేశ్వర్‌	తొండాకూరు	87.0	ఆలూర్‌	మచ్చర్ల	45.8
పోతంగల్‌	పోతంగల్‌	85.5	కమ్మర్‌పల్లి	కమ్మర్‌పల్లి	46.0
బోధన్‌	బెల్లాల్‌	81.8	ముప్కాల్‌	వేంపల్లి	44.5
చందూర్‌	చందూర్‌	79.5	ముప్కాల్‌	ముప్కాల్‌	43.8
ఆర్మూర్‌	మగ్గిడి	78.8	మెండోరా	మెండోరా	43.8
సాలూర	సాలూర	78.5	మోస్రా	మోస్రా	42.0
			వర్ని	జాకోర	27.0
			మోపాల్‌	మంచిప్ప	12.5

ఆగం చేసిన పెద్దవాగు



పెద్ద వాగు నీటి ఉధృతికి నేలకొరిగిన వరి పంట

బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గంలో ప్రవహించే పెద్దవాగు వరద అన్నదాతలను ఆగం చేసింది. గురువారం మధ్యాహ్నం నుంచి క్రమంగా పెరిగిన పెద్దవాగు సాయంత్రానికి ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. దీంతో పక్కన ఉన్న పంటలు నీట మునిగాయి. పసుపు పంటను ఆరబెట్టేందుకు తయారు చేసుకున్న కళ్లాలు కొట్టుకుపోయాయి. పసుపు ఉడికించేందుకు పెట్టిన కట్టెల కుప్పలు నీటి ప్రవాహానికి పెద్దవాగులో కలిసిపోయాయి. కట్టెల కోసం రైతులు శుక్రవారం ఉదయం నుంచి పెద్ద వాగు పక్కన వెతకడం ప్రారంభించారు. ముప్కాల్‌ మండలం వెంచిర్యాల్‌, మెండోరా మండలం వెల్కటూర్‌లో రైతులకు భారీగా నష్టం జరిగింది.

ప్రభుత్వం ఆదుకోవాలి



పెద్దవాగులోకి ఒక్కసారిగా పెద్ద ఎత్తున వరద రావడంతో పక్కనే ఉన్న మక్క, సోయా, వరి పంటలు నీట మునిగాయి. ప్రతి సంవత్సరం వరదలతో నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి. – భాస్కర్‌, రైతు, వెంచిర్యాల్‌

హైదరాబాద్‌కు బస్సుల పునరుద్ధరణ



పెర్కిట్‌ జాతీయ రహదారిపై వాహనాలను మళ్లిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌

ఆర్మూర్‌టౌన్‌/ఖలీల్‌వాడి: భారీ వర్షాల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు నిజామాబాద్‌–హైదరాబాద్‌ రూట్లో బస్సుల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే. శుక్రవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి బస్సుల రాకపోకలను ప్రారంభించారు. ప్రస్తుతం నిజామాబాద్‌ ఆర్టీసీ రీజియన్‌ పరిధిలోని ఆరు డిపోల్లో ప్రతి రోజు 588 బస్సులు ఉండగా ఇందులో 468 బస్సులు వివిధ రూట్లకు నడిపిస్తున్నారు. నిజామాబాద్‌ నుంచి కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడుస్తున్నాయి. మెదక్‌ నుంచి జెబీఎస్‌కు, ఎల్లారెడ్డి, భీమ్‌గల్‌ తదితర రూట్లలో బస్సులను నిలిపివేశారు. వాతావరణ పరిస్థితులు వివిధ రూట్లలో ఉన్న రోడ్ల పరిస్థితులకు అనుకూలంగా బస్సులను నడిపిస్తామని ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు.

ట్రాఫిక్‌ జామ్‌తో ఇబ్బందులు..

ఎన్‌హెచ్‌ 44 హైవే నుంచి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌, కర్ణాటక తదితర ప్రాంతాల భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వానలతో భారీ వాహనాలను హైవేపైనే పోలీసులు నిలిపివేశారు. దీంతో శుక్రవారం వాహనాలు ముందుకు కదులుతున్నాయి. ఒక్కసారిగా వాహనాలు భారీ సంఖ్యలో రావడంతో ట్రాఫిక్‌ సమస్య తలెత్తింది. కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి జంగంపల్లి వరకు ఉన్న ఎన్‌హెచ్‌–44పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలు హైదరాబాద్‌ వంటి ప్రాంతాలకు వెళ్లడానికి గంటకు ఒక కిలోమీటర్‌ వరకు ముందుకు కదులుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో పోలీసులు ఆర్మూర్‌ నుంచి వాహనాలను మళ్లింపు చేశారు. నిర్మల్‌ నుంచి వచ్చే వాహనాలను ఆర్మూర్‌ పట్టణంలోని పెర్కిట్‌ నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్‌ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

రైళ్ల రద్దు..



బాసర వద్ద రైల్వేబ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

కామారెడ్డి జిల్లా తల్లమడ్ల వద్ద రైల్వేట్రాక్‌ నీటి ప్రవాహంకు కొట్టుకపోవడంతో రైల్వే అధికారులు కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని నిజామాబాద్‌ నుంచి ఆర్మూర్‌, కరీంనగర్‌, పెద్దపల్లి, ఖాజీపేట్‌ మీదుగా కాచిగూడకు నడిపించారు. కానీ శుక్రవారం బాసర రైల్వే బ్రిడ్జి వద్ద గోదావరి నది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండటంతో రైల్వేశాఖ అధికారులు, రైల్వే ఎస్సై సాయిరెడ్డి పరిస్థితిని పరిశీలించారు. దీంతో బాసర మీదుగా నిజామాబాద్‌ రైల్వే జంక్షన్‌కు వచ్చే అన్ని రైళ్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు.

41,098 ఎకరాల్లో పంట నష్టం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో కలిగిన నష్టాన్ని అధికారులు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపించారు. జిల్లా వ్యాప్తంగా 20,660 మంది రైతులకు చెందిన 41,098 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఐదు ఇండ్లు ధ్వంసం కాగా, 48 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. రోడ్లు భవనాల శాఖకు చెందిన 29, పంచాయతీ రాజ్‌కు చెందిన 33 రోడ్లు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. 264 విద్యుత్‌ స్తంభాలు, 92 ట్రాన్స్‌ఫార్మర్లు, 15.5 కిలోమీటర్ల మేర విద్యుత్‌ లైన్లు దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. జిల్లాలో 15 పునరావాస కేంద్రాలను ప్రారంభించి, బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

గేదెల కాపరిని కాపాడిన పోలీసులు



బాల్కొండ: ఎస్సారెస్పీ దిగువన గోదావరి నీటిలో మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన గేదెల కాపరి బుచ్చయ్య శుక్రవారం చిక్కుకున్నాడు. ప్రాజెక్ట్‌ నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల నీటిని వదలడంతో గోదావరి గట్టు పైనుంచి హెలిప్యాడ్‌ వరకు నీరు వచ్చి చేరింది. గోదావరి గట్టున గేదెలను మేపుతున్న బుచ్చయ్య అక్కడి నుంచి కేకలు వేయడంతో స్పందించిన ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌ రెడ్డి, పోలీస్‌ సిబ్బందితో కలిసి రోప్‌ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. గేదెలను సైతం కాపాడారు.

ముంచిన ఇసుకమేట

వేల్పూర్‌: భారీ వర్షం, కప్పలవాగులో వచ్చిన అతి భారీ వరదతో మోతెలో అపారనష్టం సంభవించింది. వరద నీటి ఉధృతికి మోతె గ్రామం వద్ద నిర్మించిన చెక్‌డ్యాం కట్ట తెగిపోయింది. దీంతో పక్కనే ఉన్న వ్యవసాయ భూమి కోతకు గురైంది. వాగుకు రెండువైపులా వచ్చిన వరదతో మొక్కజొన్న, సోయా పంటలు నేలకొరిగాయి. రామన్నపేట్‌ వద్ద కల్వర్టు ధ్వంసమై రోడ్డు తెగిపోయింది. దీంతో రామన్నపేట్‌ నుంచి వేల్పూర్‌, మోతె వైపు రాకపోకలు నిలిచిపోయాయి. వరి పొలాల్లో ఇసుక మేట వేసింది.

ఎకరానికి రూ. 25వేల నష్టపరిహారం ఇవ్వాలి



బడాభీమ్‌గల్‌–భీమ్‌గల్‌ మధ్య ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌: బాల్కొండ నియోజకవర్గంలో వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. వేల్పూర్‌, భీమ్‌గల్‌ మండలాల్లో వరద ఉధృతికి దెబ్బతిన్న పంటలను, రహదారులను శుక్రవారం ఆయన సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రాథమిక లెక్కల ప్రకారం 1162 ఎకరాల్లో వరి, 95 ఎకరాల్లో మొక్కజొన్న, 35 ఎకరాల్లో సోయాబిన్‌ పంట దెబ్బతిందని అధికారులు చెప్పారన్నారు. మరొక్కసారి పంటనష్టంపై క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులకు సూచించారు. అలాగే రోడ్లు, వంతెనల మరమ్మతులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపాలన్నారు. తాను సైతం మంత్రులకు నివేదించి పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రజలెవరూ నీటి ప్రవాహాల వద్దకు వెళ్లవద్దని, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



బోధన్‌: ఎడపల్లి మండలం సాటాపూర్‌ గేట్‌ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌ పట్టణానికి చెందిన షేక్‌ అన్సార్‌(38) శుక్రవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై నిజామాబాద్‌కు బయలుదేరాడు. ఎడపల్లి మండలంలోని సాటాపూర్‌గేట్‌ వద్ద అతడు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో వైద్య చికిత్స కోసం నిజామాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగుపడిందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మోర్తాడ్‌: మోర్తాడ్‌లోని భగత్‌సింగ్‌ కాలనీలోగల ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్‌ ఎస్సై రాము తెలిపారు. మోర్తాడ్‌ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం భగత్‌సింగ్‌ కాలనీకి చెందిన గురుడి అమృత్‌రావు ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోని 9 మాసాల బంగారం, రూ.5వేల నగదు చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. విచారణలో ఎర్ల అశోక్‌ నిందితుడిగా తేలడంతో అతడిని పట్టుకొని బంగారంను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్‌

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



గోత్రాల బాల్‌రాజ్‌(ఫైల్‌)

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్‌ గ్రామ శివారులో బుధవారం ఎడ్లకట్ట వాగులో వరద ఉధృతికి కొట్టుకుపోయిన గ్రామానికి చెందిన గోత్రాల బాల్‌రాజ్‌(41) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. గురువారం నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సభ్యులు గాలించగా, శుక్రవారం ఉదయం పొలాల మధ్య మృతదేహంను గుర్తించారు. మృతుడు బాల్‌రాజ్‌ బైక్‌ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం దోమకొండకు వచ్చి తిరిగి సొంత గ్రామం సంఘమేశ్వర్‌ వెళుతుండగా, వాగులో వరద ఉధృతికి కొట్టుకుపోయాడు.రెండు రోజులుగా గాలించగా శుక్రవారం మృతదేహం లభించింది.మృతుడికి భార్య రూప, ఇద్దరు కుమారులు ఉన్నారు.తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్‌: సాలూర గ్రామ శివారులోని మంజీర నది బ్రిడ్జి వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని ఆయన తెలిపారు. స్థానిక జీపీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో అక్కడే పోస్ట్‌మార్టం నిర్వహించి గ్రామ పంచాయితీ సిబ్బందితో అక్కడే పాతిపెట్టినట్లు ఎస్సై వివరించారు.

జలాల్పూర్‌లో ఒకరి ఆత్మహత్య

వర్ని: మండలంలోని జలాల్పూర్‌ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వర్ని ఎస్సై మహేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. జలాల్పూర్‌ గ్రామానికి చెందిన మహమ్మద్‌ గౌస్‌ (47) కుటుంబంలో గొడవలు జరగడంతో అతడి భార్య వదిలిపెట్టి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన గౌస్‌ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

కంజర్‌లో యువతి...

మోపాల్‌: మండలంలోని కంజర్‌ గ్రామంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై జాడె సుస్మిత తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జినిగెల అక్షయ (20) జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో అమ్మమ్మ లక్ష్మీ, చెల్లి నవ్యతో కలిసి జీవనం సాగిస్తోంది. మృతురాలి తల్లి గతంలోనే మృతిచెందగా, తండ్రి వదిలేసి వెళ్లిపోయాడు. శుక్రవారం సాయంత్రం అక్షయ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు.